# గ్రామగ్రామాన బీఆర్ఎస్ జోరుగా ప్రచారం

- పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఓటర్లను కోరుతున్న పార్టీ శ్రేణులు



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహదేవపూర్, నవంబర్ 4 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే సూరారంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ శివారులోని పొలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మంథని డివిజన్ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతా బాయి, ఎంపీటీసీ బీసుల జయశ్రీ, మహిళా మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న, ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి తుంగ నిరంజన్ గ్రామ సోషల్ మీడియా ఇన్‌చార్జి దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిశోర్‌కుమార్‌కు డాక్టరేట్



ఏటూరునాగారం, నవంబర్ 4 : మండల కేంద్రానికి చెందిన కాత యాదగిరి-మణెమ్మ కుమారుడు కిశోర్ కుమార్ ఓయూలో డాక్టరేట్ పొందారు. ఈ ఏడాది ప్రొఫెసర్ పబ్బోజు సురేశ్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు. కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ విభాగంలో 'లర్నింగ్ మల్టిలేయర్ న్యూరల్ నెట్‌వర్క్ యూసింగ్ జనటిక్ అల్గోరిథమ్' అనే అంశంపై పరిశోధన చేశారు. యూనివర్సిటీలో రెండు రోజుల క్రితం నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో ఓయూ వీసీ రవీందర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. కిశోర్ కుమార్ ప్రస్తుతం కొత్తగూడెం కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కిశోర్ కుమార్‌ను స్థానికులు, ప్రొఫెసర్లు అభినందించారు.

## నాయీ బ్రాహ్మణ పట్టణ కమిటీ ఎన్నిక

కాటారం, నవంబర్ 4 : నాయీబ్రాహ్మణ సంఘం కాటారం పట్టణ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొయ్యల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా విజ్జగిరి రాజయ్య, ఉపాధ్యక్షులుగా పసుపునూటి రవీందర్, మల్లేశ్, గౌరవ సలహాదారులుగా విజ్జగిరి శ్రీను, కృష్ణస్వామి, రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా కొయ్యల రాజయ్య, పందిళ్ల రాజయ్య, కొలిపాక రమేశ్, శంకరయ్య, ప్రచార కార్యదర్శిగా దడిగెల శ్రీనును ఎన్నుకున్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

గణపురం, నవంబర్ 4 : మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా రంజిత్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. రంజిత్ మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష రవి, రాజు, మొగిలి, రమణారెడ్డి, శ్రీకాంత్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌కలర్ డేలో పాల్గొన్న చిన్నారులు

## రెడ్ కలర్ డే వేడుకలు

గణపురం, నవంబర్ 4 : మండల కేంద్రంలోని నారాయణ హైస్కూల్‌లో శనివారం రెడ్ కలర్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 1వ తరగతి విద్యార్థులు రెడ్ డ్రెస్ ధరించి ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం స్రవంతి మాట్లాడుతూ ప్రాణుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని రెడ్‌కలర్ డేను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భానుచందర్, డైరెక్టర్ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ, నవంబర్ 4 : భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి గీత కార్మికుడు ముత్యాల రవీందర్ గౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ గౌడ్ శుక్రవారం రాత్రి తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో పైనుంచి కిందపడిపోయాడు. అతడిని వెంటనే భూపాలపల్లిలోని జిల్లా దవాఖానకు తరలించారు.

## ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ గడువు పెంపు

### నోడల్ జిల్లా అధికారి దేవరాజం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 4 : ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు నవంబర్ 10 వరకు గడువును పొడిగించినట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి దేవరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు రూ.2000 అలస్య రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. ఈ చివరి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భూపాలపల్లి ఏరియా దవాఖాన తనిఖీ



సీఎంవో సుజాతను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 4: సింగరేణి సీఎంవో సుజాత శనివారం భూపాలపల్లి ఏరియా దవాఖానను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో సుజాతను సన్మానించారు. సింగరేణి కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ ఫిట్ సెక్రటరీ కొండి కుమార్, రమణ, వామన్ రావు, సాగర్, ఓరుగంటి రమేశ్, బత్తుల వెంకటేశ్, అవినాశ్‌రెడ్డి, దేవరకొండ మధు పాల్గొన్నారు.

## మినీ బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి



మినీ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ దిలీప్ కుమార్

గార్ల, నవంబర్ 4 : మండల కేంద్రంలోని జైన్ మందిరం పక్కన ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ మినీ బ్యాంక్‌ను మేనేజర్ దిలీప్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మినీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది మనోజ్, సంపత్, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కవాతు

గార్ల, నవంబర్ 4 : ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల కేంద్రం, పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గార్ల, బయ్యారం సీఐ బాబురావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బానోత్ వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గార్లలో కవాతు చేస్తున్న సివిల్, బీఎస్ఎఫ్ పోలీసులు



మంత్రి సత్యవతి రాథోడ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## మంత్రి వాహనం తనిఖీ

ములుగు రూరల్, నవంబర్ 4 : మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం ములుగు జిల్లా పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆమె వాహనాన్ని ములుగు మండలంలోని జంగాలపల్లి చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారులు ఆపారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.



రామప్పలో పర్యాటకులు

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, నవంబర్ 4 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో సందర్శించారు. ఆలయ పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

### సందర్శించిన అమెరికా దేశస్తుడు

రామప్పను శనివారం అమెరికా దేశస్తుడు డోనాల్డ్ వాకర్ సెంట్రల్ టూరిజం గైడ్ కరుణానిధితో కలిసి సందర్శించారు. ఆలయ ప్రాముఖ్యతను తెలుసుకొని మిగతా టెంపుల్స్ కంటే రామప్ప ప్రత్యేకమైందన్నారు.



మహేందర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న మొండయ్య

## గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేందర్

ములుగు రూరల్, నవంబర్ 4 : ములుగు జిల్లా గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జంగాలపల్లి గ్రామానికి చెందిన కూనూరు మహేందర్ గౌడ్‌ను నియమిస్తూ శనివారం జిల్లా అధ్యక్షుడు ముసినేపల్లి మొండయ్య నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ సంఘాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. వారి వెంట గౌడ సంఘం నాయకులు బొడిగ భిక్షపతిగౌడ్, జనగాం శ్రీనూ గౌడ్, వేముల వేణు గౌడ్ పాల్గొన్నారు.



నంబర్‌ప్లేట్ లేని వాహనాలను పట్టుకున్న పోలీసులు

## నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు

కృష్ణకాలనీ, నవంబర్ 4 : నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి హెచ్చరించారు. శనివారం భూపాలపల్లిలోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడుపుతున్న 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనదారులు కచ్చితంగా నంబర్ ప్లేట్లు బిగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.